సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 26 । అక్టోబర్ । 2024





## డెయిరీ నిర్వహణలో దోచుకున్నారు!

బి.కొత్తకోట, కోటావూరుల్లో పాల డెయిరీల (బీఎంసీయూ) నిర్వహణ పేరుతో రూ. 5 లక్షల నిధులు స్వాహా చేసినట్టు వెలుగులోకి వచ్చింది.

-10లో



## ఇద్దరు విగ్రహాల దొంగల అరెస్ట్

చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ సుధాకర్ వివరాలు వెల్లడించారు.

-10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.360 | రూ.440 |
| రెండోరకం | రూ.290 | రూ.356 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 299 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 460 | 480 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 509.660 కిలోలు

## న్యూస్‌రీల్

### 27న ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ



మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం నేతలు

రాయచోటి అర్బన్: ఈ నెల 27వ తేదీన రాయచోటిలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కడప జిల్లా పౌరహక్కుల సంఘం జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడు పి.రెడ్డెయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాయచోటిలోని ఎన్‌జీఓ సభా భవనంలో సంస్మరణ సభ నిర్వహించనున్నామన్నారు. సభకు కవులు, కళాకారులు, ప్రజాస్వామిక వాదులు, విద్యార్థులు, మహిళలు, కార్మికులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### డిసెంబర్‌లో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలు

రాజంపేట టౌన్: గీతా జయంతిని పురస్కరించుకొని ఈఏడాది డిసెంబర్ 1వ తేదీ ఉదయం 9 గంటల నుంచి రాజంపేట పట్టణంలోని మన్నూరు జెడ్పీ హైస్కూల్‌లో జిల్లాస్థాయిలో భగవద్గీత శ్లోకాల కంఠస్థ పోటీలను నిర్వహించనున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్తు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ టీ.గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7వ తరగతి విద్యార్థులకు ఒక విభాగంగాను, 8, 9, 10వ తరగతుల విద్యార్థులు ఒక విభాగంగా పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులు భగవద్గీత ఆరవ అధ్యాయంలోని 47 శ్లోకాలను చెప్పాల్సివుంటుందని తెలిపారు. అలాగే సంపూర్ణ భగవద్గీతపై 18 సంవత్సరాలలోపు వారికి జూనియర్స్ విభాగంలో, 18 సంవత్సరాలు పైబడిన వారికి సీనియర్స్ విభాగంలో పోటీలు ఉంటాయని తెలిపారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తిగల వారు 9110 779066, 94925 62744 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

### యువరాజ్‌ను వరించిన బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు



రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ప్రిన్సిపాల్‌గా అవార్డు అందుకుంటున్న యువరాజ్

కురబలకోట: మదనపల్లె సమీపంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ రాష్ట్ర స్థాయిలో బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు అందుకున్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టీఈ-24) మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతి ఏటా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌కు జి. కృష్ణకుమార్ స్మారక రాష్ట్ర అవార్డును ప్రకటిస్తారు. ఈసారి ఆ అవార్డు యువరాజ్‌కు లభించింది. కర్నూలులోని జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో జేఎన్‌టీయూ అనంతపురం వైస్ చాన్స్‌లర్ సుదర్శన్‌రావు చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఇదే కార్యక్రమంలో మిట్స్ కళాశాల బీటెక్ ఈఈఈ విద్యార్థి కాగితి భార్గవి, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విద్యార్థి కార్తీక్ కోవి బెస్ట్ స్టూడెంట్ ఇన్నోవేటర్ అవార్డు అందుకున్నారు. మిట్స్ కళాశాల కరస్పాండెంట్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల వీరిని అభినందించారు.

### నేటి నుంచి లోన్ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అక్టోబర్ 26, 27 తేదీల్లో కడప నగరంలోని నేక్‌నామ్ కళాక్షేత్రంలో నిర్వహించే ఎస్‌బీఐ హోమ్ లోన్ ఉత్సవ్, లోన్‌మేళాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీవాణి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు వ్యక్తిగత రుణాలు ఇవనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులకు, ఇతర ఉద్యోగులకు వ్యక్తిగత లోన్ ఇవ్వనున్నట్లు వివరించారు. వాహన, గృహ రుణాలు, ఇంటి నిర్మాణానికి, స్థలం లేదా ఇల్లు కొనేందుకు సైతం రుణాలిస్తామన్నారు. పెన్షనర్లకు పెన్షన్ రుణాలు, విదేశాలలో చదువుకోవాలనుకునే వారికి విద్యారుణాలు ఇస్తారన్నారు. స్వదేశంలో గుర్తింపు పొందిన కాలేజీలలో చదువుకొనేవారికి కూడా ఎటువంటి సెక్యూరిటీ లేదా గ్యారంటీ లేకుండా రూ. 1.5 కోట్ల వరకు విద్యా రుణం మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. మహిళలకు వడ్డీలో 0.5 శాతం రాయితీ తమ బ్యాంకు ప్రత్యేకత అన్నారు. పీఎం ముద్రా లోన్లు 10 లక్షల వరకు, పీఎం విశ్వకర్మ లోన్లు, పీఎం స్వానిధి, పారిశ్రామిక లోన్లు, చిన్న, మధ్యతరహా పారిశ్రామిక లోన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# నీళ్లు రావు.. విస్తరణ లేదు!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అక్టోబర్‌లోనే కృష్ణా జలాల తరలింపు
- ప్రస్తుతం పుంగనూరు ఉపకాలువ విస్తరణ పనులు ఆపేశారు
- అయినా కృష్ణా జలాల తరలింపు లేదు
- కరువు రైతు నోట్లో మట్టి కొట్టిన ప్రభుత్వం
- ఉమ్మడి చిత్తూరు జిల్లా, ఉమ్మడి కడపలోని రాయచోటికి
- అన్యాయం జరుగుతున్నా నోరుమెదపని టీడీపీ ఎమ్మెల్యేలు



జగన్ పాలనలో పీబీసీలో ఉరకలేస్తూ ప్రవహిస్తున్న కృష్ణా జలాలు (ఫైల్)

బి.కొత్తకోట: ఏపీఆర్ హంద్రీ–నీవా ప్రాజెక్టు రెండోదశకు సంబంధించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పుంగనూరు ఉపకాలువ (పీబీసీ) విస్తరణ పనులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసింది. మరోవైపు కరువు రైతాంగానికి కృష్ణా జలాల తరలింపు విషయంలోనూ అన్యాయమే జరుగుతోంది. ఈ రెండు అంశాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ఎంతో కీలకమైనవి. టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతోపాటు సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పానికి ఇవి ప్రాధాన్య అంశాలే. విస్తరణ పనులు నిలిపివేతతో తమ ప్రాంతాలకు అన్యాయం జరుగుతుందని, ఈ సీజన్‌లో ఇప్పటికే నీటిని తరలించాలన్న అంశాలపై అధికార టీడీపీ ఎమ్మెల్యేలు నోరు మెదపడం లేదు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో రైతాంగం మండిపడుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాతో పాటు ఉమ్మడి కడప జిల్లాలోని రాయచోటి నియోజకవర్గానికి అత్యంత ప్రయోజనం కలిగించే కాలువ విస్తరణ పనులు నిలిపివేయడం రైతాంగంలో తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

**కాలువ పని చెప్పి నీళ్లు రావన్నారు...**

పీబీసీ విస్తరణ పనులు ఈ ఏడాదిలో పూర్తి చేసి వచ్చే సీజన్‌లో పూర్తిస్థాయిలో కృష్ణా జలాలను తరలిస్తామని గత నెలలో కాలువపై పర్యటించిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. దీనితో ఈ సీజన్‌లో నీళ్లు ఇవ్వకపోయినా కాలువ విస్తరణతో భవిష్యత్‌లో నీటి కష్టాలు తీరుతాయని రైతాంగం భావించింది. అయితే చావు కబురు చల్లగా చెప్పినట్టు కాలువ విస్తరణ లేదని, లైనింగ్ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పనులు ఆపివేయించింది. పనిలేదంటే ఈ పాటికి జిల్లాలోకి కృష్ణా జలాలను పారించాల్సింది. ప్రస్తుతం రైతాంగం పరిస్థితి రెంటికి చెడ్డ రేవడి అన్నట్టుంది. సాగుకోసం నీళ్లు ఇవ్వలేదు, కాలువ విస్తరణ లేకపోయిందన్న నిరాశ వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో వ్యవసాయం రూపురేఖలు మార్చే రూ.1,217.49 కోట్లతో చేపట్టిన కాలువ విస్తరణ పనులు సాగివుంటే ఈ ప్రాంతంలో కరువును పారద్రోలి సస్యశ్యామలం అయ్యేది.

**జగన్ ఇచ్చారు.. బాబు ఇవ్వలేరా..**

శ్రీసత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ సామర్థ్యం 1.608 టీఎంసీలు. అనంతపురం జిల్లా జీడిపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను చెర్లోపల్లెకు తరలిస్తారు. దీన్ని నింపాక రిజర్వాయర్ నుంచి మొదలయ్యే హంద్రీనీవా పుంగనూరు ఉపకాలువ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లా పెద్ద తిప్పసముద్రం మండలంలోకి నీళ్లు చేరుతాయి. ఈ కాలువలోకి తొలుత నీటిని తరలించిన ఘనత గత టీడీపీ ప్రభుత్వానిదే అయినా ప్రయోజనం కలగలేదు. 2019 జనవరి 21న ప్రారంభించి ఏప్రిల్ 11 వరకు జలాలను తరలించింది కేవలం 775 ఎంసీఎఫ్‌టీలే. ఇది కాలువలో పారేందుకే సరిపోయింది. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక మూడేళ్లపాటు కృష్ణా జలాలను పుష్కలంగా తరలించారు. 2019–20లో 1.34 టీఎంసీల నీళ్లు, 2020–21లో 2.5218 టీఎంసీల నీళ్లను తరలించగా 2023–24లో 2.6 టీఎంసీల జలాలను తరలించారు. అదికూడా అక్టోబర్, నవంబర్ నెలల్లో తరలింపు ప్రారంభించి మార్చి, ఏప్రిల్ వరకు కొనసాగించారు. ఇప్పుడు అవే నీళ్లను చంద్రబాబు ప్రభుత్వం ఎందుకివ్వలేకపోతోందని రైతాంగం ప్రశ్నిస్తోంది. జలాల తరలింపు చేపడితే సీఎం నియోజకవర్గం కుప్పంకు తరలించుకుపోవచ్చు. అయితే సీఎం తన నియోజకవర్గానికి అన్యాయం చేస్తూనే టీడీపీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలకు మొండిచెయ్యి చూపిస్తున్నారు.

### ఎమ్మెల్యేలు నోరు మెదపకపోతే నష్టం..

కృష్ణా జలాలను సత్వరమే తరలించడం, పుంగనూరు ఉప కాలువ విస్తరణ పనులు కొనసాగించడంపై టీడీపీ ఎమ్మెల్యేలు స్పందించి తమ నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుతుందన్న విషయాన్ని గట్టిగా వినిపించాల్సి ఉంది. 380 క్యూసెక్కుల ప్రవాహం కలిగిన కాలువను 1,180 క్యూసెక్కులకు పెరిగితే భారీస్థాయిలో మన ప్రాంతానికి కృష్ణా జలాలు అంది కరువు ప్రాంతాలు సస్యశ్యామలం అవుతాయన్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి ఒప్పించాలి. ఇప్పటికే రూ.1,217.49 కోట్లతో పనులు చేపట్టగా ప్రభుత్వం నిలిపివేయించింది. అలాగే తంబళ్లపల్లె, పుంగనూరు మిహాయిస్తే కృష్ణా జలాలతో లాభపడేది టీడీపీ ఎమ్మెల్యేలున్న మదనపల్లె, పీలేరు, పలమనేరు, కుప్పం, చిత్తూరు, జీడీనెల్లూరు, రాయచోటి నియోజకవర్గాలే. ప్రాజెక్టు ప్రధాన కాలువ నుంచి రాయచోటిలోని శ్రీనివాసపురం రిజర్వాయర్, పీలేరులోని అడవిపల్లె రిజర్వాయర్‌కు నీటిని తరలించాలి. ఇక్కడినుంచి చిత్తూరు సమీపంలోని ఎన్టీఆర్ జలాశయానికి తరలిస్తారు. ప్రస్తుతం పుంగనూరు ఉప కాలువకు మాత్రమే నీటిని తరలిస్తే..తంబళ్లపల్లె నుంచి కుప్పం వరకు సునాయాసంగా తరలించుకోవచ్చు. ఈ కాలువ ద్వారా టీడీపీ ఎమ్మెల్యేలున్న మదనపల్లె, పలమనేరు, కుప్పం ప్రాంతాలకు సాగు, తాగునీటి కష్టాలు తీరుతాయి. ఈ విషయాన్ని టీడీపీ ఎమ్మెల్యేలు గుర్తించి స్పందించకపోతే రైతాంగ ప్రయోజనాలను దెబ్బతీసినట్టే.

### విద్యార్థులకు 'అపార్' ఐడీ జారీకి పటిష్ట చర్యలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాయచోటి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు విద్యార్థులకు అపార్ యూనిక్ ఐడీల జారీకి పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులకు సూచించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యదర్శి కోన శశిధర్ జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్లకు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్వహించే మెగా డీఎస్సీ నిర్వహణలో పొరపాట్లు జరగకుండా చూడాలని సూచించారు. అలాగే ఒక విద్యార్థి ఐడీ కింద ఒకటవ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) యూనిక్ ఐడీ జారీ చేసేందుకు ఖచ్చితమైన డేటా రూపొందించాలని ఆదేశించారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు అడుగులు అనే నినాదంతో నవంబర్ 14వ తేదీ మెగా పేరెంట్స్ టీచర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

**జిల్లా అభివృద్ధికి సమగ్ర నివేదిక సిద్ధం చేయండి..**

జిల్లా అభివృద్ధి కోసం వివిధ ప్రయోజనాల నిమిత్తం బదలాయించిన ప్రభుత్వ భూ కేటాయింపులకు సంబంధించి అన్ని శాఖలు సమగ్రంగా నివేదిక రూపొందించాలని సూచించారు. జిల్లాలో ఏపీఐఐసీ, ఏపీఎండీసీ, టూరిజం, వైద్యారోగ్యం, ఆర్టీసీ, పోలీస్, ఇతర శాఖల విభాగాలకు కేటాయించిన భూములు, వాటి విస్తీర్ణం, ఏ ప్రయోజనాల కోసం భూములు ఇచ్చారు. వాటి స్థితి గతులపై చర్చించారు. కేటాయించిన భూముల ప్రస్తుత స్థితిగతులపై మానిటరింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్‌లు మేఘ స్వరూప్, నైదియా దేవి, ఆర్డీవో రంగాస్వామి తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు





హాజరైన విద్యార్థులు, ఉపాధ్యాయులు, లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, నగర మేయర్ సురేష్‌బాబు తదితరులు

- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్
- ఘనంగా అంధుల పాఠశాల వజ్రోత్సవ వేడుకలు

కడప ఎడ్యుకేషన్: అంధులమనే ఆలోచన లేకుండా బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకుని నలుగురికి సేవలందించే స్థితికి చేరుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. కడప శంకరాపురంలో అంధుల పాఠశాల ఏర్పాటు చేసి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా శుక్రవారం పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వేపరాల ఎబినేజర్ ఆధ్వర్యంలో వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఇన్‌చార్జ్ కలెక్టర్‌తో పాటు మేయర్ సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి అంధుల ఆరాధ్యదైవం లూయిబ్రైల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ అంధులు లూయి బ్రెయిలీని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాఠశాలకు అవసమైన మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తానన్నారు. పిల్లలకు హ్యాండ్ రైట్ ఫోన్స్, లాప్స్‌ను అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**విద్యావేత్తలుగా ఎదగాలి: నగర మేయర్ సురేష్‌బాబు**

బాగా చదువుకుని మంచి విద్యావేత్తలుగా ఎదగాలని నగర మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. ఇటీవల అంధురాలు ఒకామే జిల్లా కలెక్టర్ కూడా అయ్యారని అలాంటి వారిని మీరంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తాను చిన్నచౌక సర్పంచ్‌గా ఉన్నప్పటి నుంచే అంధుల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ వస్తున్నాన్నారు. నేడు కడప కార్పొరేషన్‌లో 10 మంది అంధులకు ఉద్యోగాలను కల్పించి వారికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. చాలా మంది ఇక్కడే చదివి ఇక్కడే ఉపాధ్యాయులై సేవలందించడం అభినందనీయం అన్నారు.

**అభివృద్ధికి కృషి చేస్తాం: ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి**

అంధుల పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్సీగా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. అంధుల పాఠశాలకు జూనియర్ కళాశాల మంజూరు, అంధుల కోసం ప్రత్యేక శిక్షణా కేంద్ర ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అలాగే బ్రెయిలీ పాఠ్య పుస్తకాలు సకాలంలో విద్యార్థులకు అందించేందుకు, అలాగే నూతన భవనాల మంజూరు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించేందుకు శాయాశక్తుల కృషి చేస్తానన్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వేపరాల ఎబినైజర్ మాట్లాడుతూ అంధుల పాఠశాలలో ఇప్పటి వరకు 10వ తరగతి వరకే బోధన ఉందన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేస్తే అంధులు ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే డీఎడ్ ఒకేషనల్ కాలేజీని కూడా ఏర్పాటు చేయాలన్నారు. మాజీ హెచ్‌ఎం శంకరయ్య, ప్రాథమిక పాఠశాల హెడ్ టీచర్ రమణ, అంధుల పాఠశాల ఉపాధ్యాయులతోపాటు అంధుల సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

### ప్రొటోకాల్ ఉల్లంఘన

కడప ఎడ్యుకేషన్: కడప అంధుల ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకల వేళ పాఠశాల ఆవరణలో 26వ తేదీన ఆవిష్కరించనున్న శిలాఫలకంలో ప్రొటోకాల్ ఉల్లంఘన జరిగింది. ప్రారంభోత్సవ శిలాఫలకంలో మొదటి పేరుగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డితో పాటు తదితరుల పేర్లను శిలాఫలకంలో లిఖించారు. ఇందులో నగర ప్రథమ పౌరుడు, నగర మేయర్ సురేష్ బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్లు లేకపోవడతో అక్కడకు వచ్చిన కొందరిలో చర్చ జరిగింది. ప్రొటోకాల్ ఉల్లంఘన జరగడం సరికాదని పలువురు విమర్శలు చేశారు. ఈ ప్రొటోకాల్ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి వారికిచ్చే గౌరవాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### పేద జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ



ఫీజు రాయితీపై ఆదేశాల పత్రాన్ని జర్నలిస్టుల యూనియన్ నాయకులకు అందజేస్తున్న జేసీ రాజేంద్రన్

రాయచోటి (జగదాంబసెంటర్): ప్రైవేటు విద్యాసంస్థల్లో అక్రిడిటేషన్ కలిగిన పేద జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పిస్తున్నట్లుగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో.. అక్రిడిటేషన్ కలిగిన పేద జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీపై ఆదేశాల పత్రాన్ని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ చేతుల మీదుగా వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ నాయకులు అందుకున్నారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో అక్రిడిటేషన్ కలిగి, జర్నలిస్టులుగా పనిచేస్తున్న చాలా మంది పేదరికంలో ఉన్నారని, వారి పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ కల్పించడం అవసరమన్నారు. అందుకే జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలన్నింటికీ పేద జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ నాయకులు కలెక్టర్, జేసీలకు కృతజ్ఞతలు తెలిపారు.

# మా రూటే.. బైపాస్!

- వివాదాస్పదంగా మారుతున్న ఖాకీల నిర్ణయం
- దారి మళ్లింపుపై పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకత
- అదనపు భారంతో గమ్యాలకు ప్రయాణీకులు
- దారి మళ్లింపు కాదు... రోడ్డు విస్తరణ చేపట్టాలంటూ ప్రజల డిమాండ్



రాజంపేట బైపాస్ రహదారిలో నడుస్తున్న పల్లె వెలుగు బస్సు సర్వీసు

రాజంపేట: పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలోకి బస్సుల దారిమళ్లింపు అంశం వివాదాస్పదంగా మారుతోంది. దారిమళ్లింపు అంశంను తెరపైకి తీసుకొచ్చిన పోలీసుశాఖ నిర్ణయం ఇప్పుడు వివాదానికి దారితీస్తోంది. ఈ విషయంపై అధికారులు అవలంబిస్తున్న తీరుపై ప్రజా వ్యతిరేకత పెల్లుబుకుతోంది. ఏ ప్రయాణీకుడిని కదిలించినా 'బస్సులు బైపాస్‌లోకి వెళితే.. ఇక బస్సులు ఎందుకు ఎక్కడం, నేరుగా ఆటోలు ఎక్కితే పోలా' అని పెదవి విరిస్తున్నారు. ఎక్స్‌ప్రెస్, గ్రామీణ బస్సులు బైపాస్‌లో నుంచి రాకపోకలు కొనసాగించడానికి ట్రాఫిక్‌ను కట్టడి చేయలేక, చివరికి ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి ప్రతాపం చూపుతున్నారని పోలీసుల తీరుపై ప్రయాణీకులు పెదవి విరిస్తున్నారు. పోలీసుల తీరుతో అదనపు భారంతో గమ్యాలకు చేరుకుంటున్నామని... మా ఇబ్బందులు పట్టించుకునేవారు కరువయ్యారని ప్రజలు వాపోతున్నారన్నారు.

**ముఖ్యమైన సమయాల్లో సరే..**

పట్టణంలో ర్యాలీలు, ఉత్సవాలు ఆ సమయంలో కొంత సేపు దారిమళ్లిస్తే ట్రాఫిక్ అంతరాయం ఉండదని, అది ముఖ్యమైన సమయాల్లో సరే కానీ, నిత్యం అలాగే అంటే కష్టతరమని ప్రయాణీకులు మొరపెట్టుకుంటున్నారు. ఏకంగా కడప నుంచి వచ్చే బస్సులు పట్టణంలోకి రాకుండా నేరుగా పాతబస్టాండు చేరుకొంటే, పట్టణంలో దిగాల్సిన వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాత్రివేళలో అంధకారంలో ఉండే బైపాస్‌లో బస్సులు దిగే మహిళా ప్రయాణీకులకు రక్షణ ఉంటుందా అని నిలదీస్తున్నారు.


**విస్తరణతోనే ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారం..**

రాజంపేట పట్టణ ప్రధాన రహదారిలో పాతబస్టాండు నుంచి మన్నూరు వరకు విస్తరణ జరిపి ముందుకొచ్చిన కట్టడాలకు మార్కింగ్ కూడా ఇచ్చారు. మన్నూరు నుంచి పోస్టాఫీసు వరకు విస్తరణ చేసి సిమెంటు రోడ్డు వేశారు. అక్కడి నుంచి సిమెంటు రోడ్డు వేయడానికి కూటమి ప్రభుత్వం వెనుకాడుతోంది. విస్తరణ చేస్తే మిగిలిన రోడ్డు వేయగలిగిన పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. దారిమళ్లింపు వద్దు..విస్తరణ ముద్దు అని ప్రయాణీకులు హితవు పలుకుతున్నారు.

**ఆర్టీసీ డీఎం ఏమంటున్నారంటే..**


రాజంపేట బైపాస్‌లో బస్సులు నడపమని పోలీసుశాఖ ఆదేశించిందని , ఆమేరకు బస్సులను బైపాస్‌లో నడిపిస్తున్నామని ఆర్టీసీ డిపో మేనేజరు రమణయ్య స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తమ ఉన్నతాధికారులకు కూడా తెలియచేశామన్నారు.

### ప్రయాణీకులకు శాపంగా..




రాజంపేట బైపాస్‌లో ఆర్టీసీ బస్సులు నడపడం ప్రయాణీకులకు శాపంగా మారింది. ఆర్టీసీలో చార్జీలు పెట్టుకొని ప్రయాణిస్తే, మళ్లీ అదనంగా ఆటోలో వెళ్లాల్సి వస్తోందని.. దీంతో అదనపు భారం పడుతోందని ప్రయాణీకులు వాపోతున్నారు. గతంలో కూడా అధికారులు బస్సులు దారిమళ్లించి చేతులు కాల్చుకున్నారు. ఒకొక్కసారి ఒకొక్క పోలీసు అధికారులు తమకు నచ్చిన విధంగా తీసుకునే నిర్ణయాలు ప్రయాణీకులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి.

### బైపాస్‌లో బస్సుల రాకతో ఇబ్బందులు



బైపాస్‌లో బస్సుల రాకతో ఇబ్బందులు పడుతున్నాము. ప్రయాణీకులు తికమకపడుతున్నారు. దూరప్రాంత సర్వీసులు బైపాస్‌లో వెళుతుంటాయి. ఇప్పుడు ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగులు కూడా బైపాస్‌లో వెళ్లడం ప్రయాణీకులపై అదనపుభారం పడుతుంది. బైపాస్‌లో ఆటోలు కూడా ఉండవు. మహిళలు, పిల్లలు, వృద్ధులకు ఇబ్బందులు తప్పడం లేదు. - బాలాజీ, చిట్వేలి

### బైపాస్ రహదారిలో బస్సులు నడపడంతో ఇబ్బందులు



రాజంపేట బైపాస్ రహదారిలో బస్సులు నడపడంతో ఇబ్బందులు పడుతున్నాం. బైపాస్‌లో దిగితే ఆటోలు ఉండవు. ఒక వేళ ఉన్నా ఎక్కువ డబ్బు అడుగుతారు. పట్టణంలోకి నడుచుకుంటూ వెళ్లాలి. పట్టణ ప్రధాన రహదారి మన్నూరు నుంచి పాతబస్టాండు వరకు చాలా మంది ఇది వరకు బస్సులో దిగేవారు. ఇప్పటికైనా ప్రయాణీకుల కష్టాలపై అధికారులు పునరాలోచించాలి.

- జంపయ్య, నందలూరు

## క్లుప్తంగా

### సారా విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

**మదనపల్లె :** సారా విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని బాలాజీ నగర్‌లో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో, హెడ్ కానిస్టేబుల్ పెంచలయ్య సిబ్బందితో కలిసి దాడి చేశారు. స్థానికంగా సారా విక్రయిస్తున్న నరసింహులు నాయక్ భార్య బుక్కే అంజనమ్మ(35)ను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

### మహిళ అదృశ్యం

**మదనపల్లె :** మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. పట్టణంలోని బీకే పల్లె వైఎస్సార్ కాలనీకి చెందిన మస్తాన్‌వలి భార్య గులాబ్ షా (28) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో గురువారం రాత్రి టూటౌన్ పోలీసులకు మస్తాన్‌వలి ఫిర్యాదు చేశారు. అదృశ్యమైన మహిళకు ఒక బాబు, ఒక పాప ఉన్నారు. సీఐ ఆదేశాలతో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యార్థికి గాయాలు



చికిత్స పొందుతున్న రేహాన్

**గాలివీడు :** స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి రేహాన్ తలకు గాయాలయ్యాయి. తోటి విద్యార్థుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రేహాన్‌ను ఉపాధ్యాయుడు రైటింగ్ ప్యాడ్‌తో కొట్టడం వల్ల తీవ్ర రక్తస్రావం కావడంతో.. ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయగా నాలుగు కుట్లు పడ్డట్లుగా సమాచారం. అయితే అలాంటిదేమీ లేదని విద్యార్థుల తోపులాటలో స్వల్ప గాయాలయ్యాయని ప్రధానోపాధ్యాయులు చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా సెప్టెంబర్ 15న ఇదే పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థిని చితకబాదిన ఉదంతం జిల్లా విద్యాశాఖ అధికారుల వద్దకు వెళ్లింది. అక్కడ తల్లిదండ్రులను బుజ్జగించి కేసు లేకుండా రాజీ చేశారు. ఇది మరువకముందే మరో ఘటన జరగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా జిల్లా విద్యాశాఖ అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# డెయిరీ నిర్వహణలో దోచుకున్నారు!

- డీజిల్, రిపేర్ల పేరుతో రూ.5 లక్షలు స్వాహా
- బిల్లులు, లెక్కలు లేవని ఆడిట్‌లో తేల్చిన అధికారులు
- ఎఫ్‌పీఓ నిర్మాణం నిధుల లెక్కలపైనా అభ్యంతరం



బి.కొత్తకోట మండల సమాఖ్య కార్యాలయం

**బి.కొత్తకోట :** మండలంలోని బి.కొత్తకోట, కోటావూరుల్లో పాల డెయిరీల (బీఎంసీయూ) నిర్వహణ పేరుతో నిధులు స్వాహా చేసినట్టు వెలుగులోకి వచ్చింది. 2023–24 ఆర్థిక సంవత్సర ఆడిట్ నివేదిక ఆధారంగా.. రూ.5 లక్షలకు పైగా స్వాహా చేశారని తేలింది. బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాలయ ఆవరణలోని భవనంలో బీఎంసీయూ, కోటావూరు గ్రామం కాండ్లమడుగులోని బీఎంసీయూ (వీటిని మరో చోటికి తరలించారు)లు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వీటి నిర్వహణ, ఆర్థిక పరిస్థితుల లాభనష్టాలు, ఆదాయ, వ్యయాలపై గత ఆర్థిక సంవత్సరానికి అధికారులు ఆడిట్ చేశారు. బి.కొత్తకోట బీఎంసీయూలో రిపేర్లకు రూ.1,90,095, డీజిల్‌కు రూ.1,16,100, కోటావూరు బీఎంసీయూలో రిపేర్లకు రూ.1,95,792, డీజిల్‌కు రూ.89,200 ఖర్చు చేసినట్టు ఆడిట్ అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ మొత్తం రూ.5,91,187 నిధుల్లో రూ.5 లక్షల వరకు స్వాహా చేశారని భావిస్తున్నారు. రిపేర్లు చేయించి వుంటే వాటికి సంబంధించిన బిల్లులు ఉండాలి. డీజిల్ వాడినట్లయితే ప్రతి పెట్రోలు బంకులో బిల్లులు ఇస్తారు. అయినా బిల్లులు లేవు. వీటి పేరుతో చేసిన ఖర్చులపై ఆడిట్ అధికారులు అడిగిన మేరకు.. నిర్వహణ బాధ్యత చూస్తున్న అధికారులు వివరాలు ఇవ్వలేదు. ముఖ్యంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం అన్నది దాదాపుగా లేదు. భారీ వర్షాలు, లైన్ల సమస్య ఉన్నప్పుడు మినహా విద్యుత్ సరఫరా కట్ లేదు. ఒకవేళ సరఫరా కట్ అయినా బీఎంసీయూలకు జనరేటర్ కోసం డీజిల్ వినియోగించిన తేదీల్లో విద్యుత్ సరఫరా ఉందా లేదా అన్న వివరాలు సబ్‌స్టేషన్లలో అందుబాటులో ఉంటాయి. ఎంత సమయం పవర్ కట్ అయ్యింది, ఆ సమయానికి ఎంత డీజిల్ వినియోగం ఉండొచ్చు అనే లెక్కలు వేస్తే.. ఏ మేరకు స్వాహా చేశారో ఇంకా స్పష్టంగా తేలుతుంది. ఇదే తరహాలో బీఎంసీయూల్లో రిపేర్ల వ్యవహారం సాగి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం అవుతోంది. నిర్వహణ లెక్కల్లో ఆదాయం పెరగాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా నష్టాలు చూపించారు. డీజిల్, రిపేర్ల పేరుతో నిధులు చూపడం వల్లే ఇలా జరిగినట్టు తెలుస్తోంది. ఆడిట్‌లో వెలుగు చూసిన ఈ నిధుల స్వాహాపై ఉన్నతాధికారులు నివేదికపై చర్యలు చేపట్టలేదు. కాగా బి.కొత్తకోట ఎఫ్‌పీఓ గోదాము నిర్మాణం విషయంలో మంజూరు చేసిన నిధులపై వివాదం నెలకొంది. లక్షల్లో చెల్లించిన నిధుల వినియోగం నిబంధనల మేరకు జరిగిందా లేదా అన్నదానిపై అనుమానాలున్నాయి. ఈ నిధులపై జిల్లా అధికారులు ఆరా తీసి ఆగ్రహం వ్యక్తం చేసి.. లెక్కలు చెప్పాలని గత ఏపీఎంను ఆదేశించినట్టు తెలిసింది.

**లెక్కలు సరిగా వేయలేదు**

బీఎంసీయూల్లో నిధుల స్వాహా ఆడిట్ నివేదికపై గత ఏపీఎం మురళీ శుక్రవారం వివరణ ఇచ్చారు. ఆడిట్ అభ్యంతరాల గురించి ప్రస్తావించగా నిధుల వినియోగంపై అకౌంటెంట్ వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడం వల్లే ఈ సమస్య వచ్చిందని చెప్పారు. నిర్వహణలో నిధుల స్వాహా జరగలేదని చెప్పారు.

### యువకుడి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్)

**రైల్వేకోడూరు అర్బన్ :** మండలంలోని కేబుడుగుంటపల్లి దళితవాడకు చెందిన ఎట్టి వెంకటేష్ (24) శుక్రవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కడుపు నొప్పి తాళలేక ఆయన ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** కుటుంబ సమస్యల కారణంగా వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. అనపగుట్టకు చెందిన వెంకటరమణ కుమారుడు శివరాం (30) బొలెరో వాహనం సిమెంట్ రవాణాకు ఉపయోగిస్తూ జీవిస్తున్నాడు. సాయంత్రం నీరుగట్టువారి పల్లె టమాట మార్కెట్ వద్ద మనస్తాపం చెంది పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్నేహితులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి బాధితున్ని తరలించారు.

### బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

**మదనపల్లె :** బైక్ అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా కదిరి పట్టణానికి చెందిన నాగరాజా (26) వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వస్తూ జగన్ కాలనీ సమీపంలో బైక్ అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితున్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన హరినాథ

**రామాపురం :** రాయచోటి–వేంపల్లి జాతీయ రహదారిలోని రామాపురం మండలం కుమ్మరపల్లి గ్రామ పంచాయతీ సూరకవాండ్లపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లికి చెందిన పల్లె హరినాథ(46) రాయచోటి పట్టణంలో చికెన్ షాప్‌లో రోజు కూలీగా పని చేస్తూ జీవనం సాగించే వాడు. రోజు మాదిరిగానే పని ముగించుకొని ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలోని డాక్టర్ జనార్దన్‌రెడ్డి తోట వద్దకు రాగానే.. వెనుక వైపు నుంచి లక్కిరెడ్డిపల్లెకు చెందిన సయ్యద్ నూర్‌బాషా రాయచోటి నుంచి లక్కిరెడ్డిపల్లికి ద్విచక్రవాహనంతో వస్తూ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో వారిద్దరికీ తీవ్ర గాయాలు కావడంతో సమాచారం తెలుసుకున్న పోలీసులు చికిత్స నిమిత్తం 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హరినాథను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. నూర్‌బాషాను కడప రిమ్స్‌కు తరలించారు. హరినాథ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## 23 ఎర్రచందనం దుంగల స్వాధీనం



పట్టుకున్న ఎర్రచందనం దుంగలు, స్మగ్లర్లతో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది

**సిద్దవటం :** సిద్దవటం రేంజ్ మద్దూరు బీటు నీళ్ల సరికోనలో శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరు స్మగ్లర్‌లను అరెస్టు చేసి, 23 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. సిద్దవటంలోని అటవీ శాఖ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేంజర్ బి.కళావతి వివరాలు వెల్లడించారు. మద్దూరు బీటులోని అనుమానిత ప్రదేశాల్లో అటవీ శాఖ అధికారులు సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. నీళ్ల సరికోన అటవీ ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ఈ క్రమంలో సిబ్బందిని చూసి వారు పారిపోతుండగా వెంటపడ్డారు. ఎట్టకేలకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడ లభ్యమైన 23 ఎర్రచందనం దుంగలతోపాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. వాటిని సిద్దవటం అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. పరారైన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. పట్టుబడిన స్మగ్లర్లు తమిళనాడుకు చెందిన రంగస్వామి, భూపాలన్‌గా గుర్తించారు. ఎర్రచందనం దుంగల బరువు 569 కిలోలు ఉండగా, వాటి విలువ రూ.1,58,085 ఉంటుంది. ఇద్దరు స్మగ్లర్‌లను తిరుపతి కోర్టుకు తరలించారు. సమావేశంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎఫ్‌బీఓలు దీపిక, విశ్వనాథ్‌రెడ్డి, ఏబీఓ హైమావతి, బేస్ క్యాంపు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇద్దరు విగ్రహాల దొంగల అరెస్ట్





విగ్రహాల దొంగలను చూపిస్తున్న డీఎస్పీ, సీఐ (ఇన్‌సెట్‌లో) పోలీసులు స్వాధీనం చేసుకున్న విగ్రహాలు

**రాజంపేట రూరల్ :** విగ్రహాల చోరీ కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి విగ్రహాలు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఎన్.సుధాకర్ సీఐ డి.రామాంజనేయుడుతో కలిసి శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండల పరిధిలోని పోలి చెరువు వద్ద ఉన్న శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 17న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు.. ఇత్తడితో తయారు చేసిన పంచముఖ ఆంజనేయస్వామి, లక్ష్మీదేవి, వినాయకస్వామి విగ్రహాలను దొంగలించారు. ఈ విషయంపై ఆలయ పురోహితుడు బల్లా వజ్జల సుధీర్‌శర్మ ఈ నెల 18న పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రామాంజనేయుడు ఆధ్వర్యంలో వారు దర్యాప్తు చేపట్టారు. కడప నగరానికి చెందిన షేక్ మస్తాన్ అలియాస్ సలీం అలియాస్ దబిడి దిబిడి, సయ్యద్ మస్తాన్‌బాషాను తిరుపతి రహదారిలోని శ్రీఅయ్యప్పస్వామి దేవస్థానం సమీపంలో శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.50 వేల విలువ చేసే 3 విగ్రహాలను స్వాధీనం చేసుకున్నారు. మస్తాన్ గతంలో నందలూరులోని ఆంజనేయస్వామి దేవస్థానంలో వెండి తొడుగు దొంగలించినట్లు కేసు నమోదైంది. ఆ కేసులో కడపలోని సెంట్రలు జైలులో మార్చి వరకు శిక్ష అనుభవించాడు. మస్తాన్ పలు నేరాలలో ముద్దాయిగా ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరిని కోర్టుకు హాజరు పరిచి రిమాండ్‌కు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ ఎస్.సుబ్బయ్య, హెడ్ కానిస్టేబుల్ పోలి నందకుమార్‌రెడ్డి, కానిస్టేబుల్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేపు ప్రైవేటు పాఠశాలల విద్యా సదస్సు

**కడప ఎడ్యుకేషన్ :** కడపలోని ఉమేష్‌చంద్ర కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం అన్ ఎయిడెడ్ పాఠశాలల సమస్యలపై విద్యా సద స్సు నిర్వహిస్తున్నట్లు ఏపీ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మ్యానేజ్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గువ్వల శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఈ సదస్సులో సమస్యలపై చర్చించి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు నివేదికలను సమర్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కావున ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్లు హాజరు కావాలని కోరారు.

## ఇటుకల ట్రాక్టర్ బోల్తా

**మదనపల్లె :** కూలీలతో వెళ్తున్న ఇటుకల ట్రాక్టర్ ముందుకు వెళ్లలేక, ట్రాలీ బోల్తా పడడంతో బీహార్ కూలీలు గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లి మండలంలో జరిగింది. సీటీఎం రోడ్డులోని తట్టివారిపల్లె ఉన్న ఇటుకల ఫ్యాక్టరీలో బీహార్ రాష్ట్రానికి చెందిన కూలీలు పని చేస్తున్నారు. ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌లో కూలీలు కూర్చుని పట్టణంలోని విజయనగర్ కాలనీలో దింపేందుకు వచ్చారు. మిట్టపై ట్రాక్టర్ ముందుకు లాగలేక ప్రమాదవశాత్తు ట్రాలీ బోల్తా పడి ఇటుకలు కింద పడడంతో ట్రాక్టర్‌లోని బీహార్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు కూలీలకు, ఇద్దరు చంటి పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద తీవ్రత కారణంగా కూలీలు స్వల్పంగా గాయపడడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే గాయపడిన వారు జిల్లా ఆసుపత్రికి రాలేదని అత్యవసర విభాగం సిబ్బంది, ఔట్ పోస్ట్ పోలీసులు తెలిపారు.



## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

**రాయచోటి టౌన్ :** పర్యావరణాన్ని రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నమయ్య జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు అన్నారు. అమరవీరుల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు పర్యావరణ పరిరక్షణలో పోలీసుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో పోలీసుల పాత్ర చాలా గొప్పదన్నారు. సమాజంలో పోలీసులు విధి నిర్వహణతోపాటు పర్యావరణాన్ని కాపాడే బాధ్యత కూడా తీసుకోవాలని చెప్పారు. పర్యావరణం సమతుల్యంగా ఉంటేనే సకాలంలో వర్షాలు కురుస్తాయని, తద్వారా పంటలు సమృద్ధిగా పండుతాయన్నారు. అప్పుడే అందరం ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఆర్ఐ(అడ్మిన్) వీజే రామకృష్ణ, వ్యాసరచన నిర్వహణ ఉపాధ్యాయులు ఆంజనేయులు, బీఎస్ పద్మావతి, పి.రాజ, ఎన్.రీవుల్లాఖాన్, ఎస్.సజ్జద్, ఆర్ఎస్ఐలు అమరనాథరెడ్డి, జి.రవి, ఎస్.ఉల్లావుద్దీన్, జె.హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం



మైదానాన్ని పరిశీలిస్తున్న ఏసీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ చైర్మన్ విజయకుమార్

**మదనపల్లె సిటీ :** గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించి సబ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని ఏసీఏ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ చైర్మన్ విజయకుమార్ అన్నారు. శుక్రవారం మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని ఆయన పరిశీలించారు. క్రికెట్ క్రీడలో మట్టిలో మాణిక్యాలను వెలుగు తీయాలన్న లక్ష్యంతో నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో సబ్ సెంటర్లు ఏర్పాటు చేసి కోచ్‌లను నియమిస్తామన్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని చిన్ని, కార్యదర్శి సాన సతీష్ ఆధ్వర్యంలో క్రికెట్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆయన వెంట జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీధర్‌కుమార్, శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ సతీష్, సీడీసీఓ కోచ్ సునిల్, క్రీడాభారతి సభ్యులు నరేష్, విజయ్, పీడీలు శరత్, మహేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### కత్తితో దాడి.. వ్యక్తికి గాయాలు

**రైల్వేకోడూరు అర్బన్ :** కత్తితో దాడి చేసిన ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని శ్రీనివాసానగర్‌లో నివాసముంటున్న వంశీకృష్ణ, చిట్వేలి బైపాస్‌లోని వెంకటేష్ స్నేహితులు. వీరి మధ్య చిన్న గొడవలు ఉన్నాయి. మద్యం సేవించి పాతకక్షలతో శుక్రవారం రాత్రి గొడవ పడ్డారు. మాటకుమాట పెరిగి వంశీకృష్ణపై వెంకటేష్ కత్తితో దాడి చేశాడు. గాయాల పాలైన వంశీకృష్ణ ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### హత్య కేసు కొట్టివేత



నిర్దోషులుగా విడుదలైన తిమ్మయ్య, రామకృష్ణ

**సుండుపల్లె :** మండల పరిధిలోని పెద్దగొల్లపల్లికి చెందిన బుట్టిమాని తిమ్మయ్య అనే వ్యక్తిని అతని స్నేహితులైన తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణలు హత్య చేశారనే ఆరోపణపై నమోదైన కేసును రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి శుక్రవారం సాయంత్రం కొట్టివేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సుండుపల్లి మండలం పెద్దగొల్లపల్లికి చెందిన బుట్టిమాని తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణ, బుట్టిమాని చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్యలు ప్రాణ స్నేహితులు. వీరు కలిసిమెలసి ఉండేవారు. చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్యకు అదే గ్రామానికి చెందిన ఎర్రయ్యకు 2019 నవంబర్‌లో భూ తగాదాలు వచ్చాయి. చిన్నప్ప సోదరుడైన తిమ్మయ్య ఎర్రగొల్ల ఎర్రయ్య అనే వ్యక్తికి మద్దతు తెలిపాడని బుట్టిమాని తిమ్మయ్య, రెడ్డిచర్ల రామకృష్ణ కలిసి.. ఒక పథకం ప్రకారం రెడ్డిచర్ల రామకృష్ణ ఇంట్లో 2019 నవంబర్ 7న హత్య చేశారని సుండుపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. తిమ్మయ్యను రెడ్డిచర్ల రామకృష్ణ చేతులు విరిచి వెనక్కి పట్టుకోగా బుట్టిమాని తిమ్మయ్య రోకలి బడితో తలపై బాదడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయినట్లు పోలీసులు కోర్టుకు నివేదించారు. ఈ కేసుపై పూర్తి విచారణ చేసిన అనంతరం పోలీసులు కేసును రుజువు చేయడంలో విఫలమయ్యారని రాయచోటి ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి కొట్టివేశారు. మొబైల్ తరపున న్యాయవాదులు టి.ఈశ్వర్, పి.రెడ్డయ్యలు వాదించారు.

### భోజనం పెట్టలేదని నర్సింగ్ విద్యార్థుల ఆందోళన

**జమ్మలమడుగు :** జమ్మలమడుగు పట్టణం సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి ఆవరణలోని నర్సింగ్ కాలేజీ విద్యార్థులు గురువారం రాత్రి యాజమాన్యం అన్నం పెట్టడం లేదంటూ నిరసన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టలేని కారణంగా ఈ విధంగా చేశారని, ఆకలితో ఇబ్బంది పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలలో ప్రస్తుతం ఆర్థిక పరంగా ఇబ్బందులు ఉండటంతో.. కేవలం రెండు నెలలకు సంబంధించిన మెస్ ఫీజు చెల్లించలేదని, గతంలో సక్రమంగా చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘం నాయకులు నర్సింగ్ కాలేజీ విద్యార్థులను పరామర్శించడంతోపాటు యాజమాన్యంతో చర్చించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకుడు శివకుమార్ సీఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆగస్టీన్ రాజుతో చర్చించారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ సాయిశ్రీ విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము విద్యార్థులతో మాట్లాడామని తెలిపారు. రెండు రోజుల నుంచి సరిగా భోజనం పెట్టడం లేదని వారు తెలిపారని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు చర్యలను తీసుకుంటామని వివరించారు.



## పశువైద్య కళాశాల అభివృద్ధికి కృషి

**ప్రొద్దుటూరు :** పశువైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. పశువైద్య కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు ముగింపు సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన కన్నబిడ్డ లాంటి ఈ కాలేజీలో ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు తమ పరిశోధన పత్రాలు సమర్పించారన్నారు. ఈ కాలేజీ స్థాపనకు చేసిన కృషిని ఎమ్మెల్యే తెలుపుతూ భావోద్వేగానికి గురయ్యారు. మూగ జీవాల మీద ఉన్న ప్రేమతో ఈ కాలేజీని ఇక్కడ పెట్టడం జరిగిందన్నారు. ఈ కాలేజీ అభివృద్ధి ఏ సాయం కావాలన్నా చేస్తానని తెలిపారు. కాలేజీకి రోడ్డు మరమ్మతు పనులను త్వరలో చేపడుతామన్నారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి కాలేజీలో ఆడిటోరియం నిర్మిస్తామని చెప్పారు. అనంతరం పశువులలో పునరుత్పత్తి సమస్యల నివారణ చర్యలు, సమీకృత దాణా తక్కువ ఖర్చుతో తయారీ అనే అంశాల్లో ఆదర్శ రైతుల సందేహాలకు శాస్త్రవేత్తలు సమాధానాలు చెప్పారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ రాజకిశోర్ మాట్లాడుతూ మూడు రోజులుగా జరిగిన జాతీయ సదస్సుల్లో 8 టెక్నికల్ సెషన్స్ జరిగాయని, వాటిలో 16 లీడ్‌పేపర్స్‌ను ప్రజెంట్ చేశారన్నారు. 181 పరిశోధన పత్రాలను దేశ, విదేశాల శాస్త్రవేత్తలు ప్రజెంట్ చేశారని వివరించారు. శాస్త్రవేత్తలు తమ పరిశోధనా పత్రాలకు గాను ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎల్‌డీఏ సీఈఓ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, జేడీ డాక్టర్ శారదమ్మ, డాక్టర్ సీహెచ్ శ్రీలత, ఎస్‌వీఎస్‌బీటీ ప్రెసిడెంట్ డాక్టర్ ధామి, కాలేజీ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.